# 'సా విద్యా యా విముక్తయే'

**ప్రేమస్వరూపులారా!** అహంకారము కలిగిన మానవుని కట్టుకున్న భార్య, కన్నబిడ్డలు సహితం ప్రేమించరు. అహంకారము లేనివానిని లోకమంతా ప్రేమిస్తుంది. క్రోధమున్నంతవరకు మానవునికి శోకము తప్పదు. కోరికలు ఉన్నంతవరకు మనస్సుకు శాంతి లేదు. లోభమున్నంతవరకు మనిషికి సుఖము లేదు. లోభము గలవానిని సర్వదుఃఖములూ వెంటాడుతుంటాయి.

ఈనాడు విద్యారంగమునందు మాత్రమేగాక అన్ని రంగములందు అశాంతి, అక్రమము, అనాచారములు తాండవమాడుచున్నవి. రాజకీయ, లౌకిక, ఆర్థిక, ఆధ్యాత్మిక రంగములన్నింటియందు దినదినమునకూ అశాంతి పెరిగిపోతున్నది. ఏ రంగములో ప్రవేశించినప్పటికీ, ఎక్కడికి వెళ్ళినప్పటికీ మానవుణ్ని భయము వెంటాడుతున్నది. ఇది తనలోని దోషములయొక్క ప్రభావమే! భయములేని మానవుడు ఈ జగత్తులో కనిపించడం లేదు. ఇంట్లో భయము, వీధిలో భయము, ఆఫీసులో భయము, కాలేజీలో భయము, బజార్లో భయము... ఎక్కడికి వెళ్ళినా భయమే! ఇంక, భయం లేని స్థానమెక్కడ? దైవప్రేమతోకూడిన మందిరములందు మాత్రమే భయముండదు.

ఒకానొక సమయంలో బ్రిటీషు ప్రధాని చర్చిల్ చెప్పాడు: Man has conquered everything, but he has not conquered himself. మానవుడు లోకములో అన్నింటినీ జయించినాడుగాని, తనను తాను జయించలేక పోతున్నాడు. ఇదే విషయాన్ని బాలుడైన ప్రహ్లాదుడు తండ్రితో ధైర్యంగా చెప్పాడు, 'లోకములన్నియున్ గడియలోన జయించినవాడ వింద్రియానీకము జిత్తమున్ గెలువనేరవు.' మానవుడు అన్ని రంగములలోను అభివృద్ధి సాధించినప్పటికీ అతనిని భయము మాత్రం వదలడంలేదు. ప్రతి మానవుణ్ణి భయము ఆవరించియున్నది. భయమును దూరం చేసుకొనవలెనన్న మానవుడు

sri sathyasai vachanamrutam

దైవప్రేమను అభివృద్ధిపరచుకోవాలి. దైవప్రేరణచేతనే ధైర్య సాహసములు లభ్యమౌతాయి.

విద్యార్థినీ విద్యార్థులారా! మీరీ ప్రపంచాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి. ఈనాటి పరిస్థితులలో ధైర్య సాహసములే మనకు సరియైన బలములు. దైవాన్ని మీ ముందుంచుకున్నప్పుడు మీరు ఎటువంటి కష్టములనైనా ధైర్యంగా ఎదుర్కో వచ్చును. 'జీవితం ఒక సవాలు - ఎదుర్కోండి. జీవితం ఒక క్రీడ - ఆడండి.' ఈనాడు విద్యారంగములో మీరెంతో అభివృద్ధిని సాధించారు. కాని, ముఖ్యంగా మీరు ఎదుర్కోవలసింది అధైర్యము. అధైర్యానికి మీరు అవకాశమివ్వడంవల్లనే మిమ్మల్ని భయభ్రాంతులు వెంటాడుతున్నాయి. విద్య అనగా గ్రంథపరిచయం కాదు. 'సా విద్యా యా విముక్తయే', మోక్షసాధనకు ఏది తోడ్పడుతుందో అదే నిజమైన విద్య. అట్టి విద్యను సాధించినప్పుడే మీరు ధైర్యసాహసములను పొందగలరు. విద్య అనేది గొప్ప ధనము.

విద్య యొసగును వినయంబు, వినయమునను
బడయు పాత్రత, పాత్రతవలన ధనము
ధనమువలనను ధర్మంబు దానివలన
ఐహికాముష్మిక సుఖంబులందు నరుడు

**ఎవరు నిజమైన పండితుడు?**

ఒకానొక సమయంలో జనకమహారాజు ఒక గొప్ప పండితసభను ఏర్పాటు చేశాడు. ఆ సభలోకి అష్టావక్రుడనే ఒక మహాపండితుడు ప్రవేశించాడు. అష్టవంకరలు తిరిగి ఉన్న అతని రూపము చూసి పండితులందరూ పక్కున నవ్వారు. వెంటనే అష్టావక్రుడు వారికంటే రెండింతలు అధికంగా నవ్వాడు. ఒక పండితుడు లేచి, 'అష్టావక్రా! మేము నవ్వడానికి ఒక కారణమున్నది. అష్టవంకరలతో కూడిన నీ దేహాన్ని చూసేసరికి మాకు నవ్వొచ్చింది. మరి నీవు నవ్వడానికిగల కారణమేమిటో తెలుసుకో వచ్చునా?' అని అడిగాడు. అప్పుడు అష్టావక్రుడు, 'అయ్యా! మీరు నా వంకర దేహమును చూసి నవ్వారు. నేను మీ వంకరబుద్ధులను చూసి నవ్వవలసివచ్చింది. ముందు మీ బుద్ధులను చక్కదిద్దుకోండి. ఇక్కడేదో గొప్ప పండితుల సమావేశం జరుగుతున్నదని భావించి ఇందులోకి ప్రవేశించాను.

srisathyasaivachanamrutam

కాని, ఇక్కడ ఒక్క పండితుడైనా నాకు కనిపించడం లేదు. అందరూ చర్మకారులే కనిపిస్తున్నారు. చర్మముయొక్క సంగతి చర్మకారులకే తెలుస్తుంది,' అన్నాడు. చర్మకారులనగా చెప్పులు కుట్టే వ్యక్తులు. అష్టావక్రుని సమాధానం విని పండితులకు కోపం వచ్చింది. "మేమందరం గొప్ప పండితులం. మమ్మల్ని చెప్పులు కుట్టేవారిగా వర్ణించడానికి నీకెంత ధైర్యం?" అని అతనిపై ధ్వజమెత్తారు. ఇదంతా చూస్తున్న జనకచక్రవర్తి ఏమాత్రం చలించలేదు. నిశ్చల మనస్కుడై నిర్మల, నిస్వార్థభావముతో కూర్చున్నాడు. అష్టావక్రుడు, "మహారాజా! 'పండితాః సమదర్శినః' అన్నారు. సమదృష్టి కలిగిన పండితుడు ఒక్కడైనా నాకిక్కడ కనిపించడం లేదు," అన్నాడు. జనకుడు చాలా సంతోషించి, "మహాత్మా! మీరు చెప్పింది పరమ సత్యము. ఇందులో సమచిత్తము, సమబుద్ధి కల్గినవారు ఒక్కరూ లేరు. సమబుద్ధి, సత్యచింతన, పవిత్రభావములు గలవాడే నిజమైన పండితుడు. ఈనాడు మీరు ఈ సమావేశానికి రావడం నిజంగా మా అదృష్టం," అన్నాడు.

**'విద్య నేర్చితినంచు విఱ్ఱవీగకు'**

ఈనాటి చదువులు మస్తకాన్ని గ్రంథపరిచయంతో నింపుతున్నాయేగాని, హృదయాన్ని ప్రేమతో నింపడం లేదు. గ్రంథపరిచయముద్వారా మనకు లభించేది కేవలం 'సూపర్‌ఫీషియల్ నాలెడ్జి' (మిడిమిడి జ్ఞానము). ఇలాంటి నాలెడ్జిని పెట్టుకొని ప్రయోజనమేమిటి? 'ప్రాక్టికల్ నాలెడ్జి' (అనుభవజ్ఞానము) సంపాదించాలి. అప్పుడే మీరు ధన్యులౌతారు, విద్యావంతులనే సత్కీర్తిని సాధిస్తారు. ఈనాటి పిల్లలు పరీక్షల్లో కావలసినన్ని మార్కులు తెచ్చుకుంటున్నారు; ఫస్టుర్యాంకులు సాధిస్తున్నారు. కాని, గుణములో ఫస్టు ర్యాంకులు సాధిస్తున్నారా? ఈ ప్రశ్న వేస్తే జవాబు రావడం లేదు. జనకునివంటి చక్రవర్తులు, అష్టావక్రుని వంటి మహాపండితులు, ఋషులు జన్మించిన పవిత్ర భారతదేశంలో ఈనాడు గుణవంతులైన విద్యావంతులు కరవైనారు. నిజంగా వారి ముఖం చూస్తే విద్యావంతులలో ఉండవలసిన తేజస్సే కనిపించడం లేదు. 'విద్య నేర్చితినంచు విఱ్ఱవీగకు.' ఏమిటీ విద్యలు? అసలివి విద్యలేనా? కాదు, కాదు. ఇలాంటి విద్యలు నేర్చుకొని గొప్ప విద్యావంతులమని గర్వించడం మీకే అవమానం! మీరు విద్యనభ్యసించవలసింది సమాజాన్ని అభివృద్ధిపరచే నిమిత్తమేగాని, గ్రంథ పరిచయంకోసం కాదు. కాని, ఈనాడు

srisathyasaivachanamrutam

విద్యను బజార్లో పెడుతున్నారు. విద్య అంటే ఏమిటో ఎవ్వరికీ అర్థం కావడం లేదు. ఎట్టి విద్యను మనం నేర్చుకోవాలి? ముక్తిని సాధించడానికి ఏది ఉపకరిస్తుందో అట్టి విద్యను నేర్వాలి. అప్పుడే మీరు నిజమైన విద్యావంతులౌతారు. ఈనాడు మీరు నేర్చే విద్యలు మోక్షసాధనకు ఉపకరించవు. పిల్లలు స్కూలుకి వెళుతున్నారు. కాని, ఏమి నేర్చుకుంటున్నారు? 'బా... బా... బ్లాక్ షీప్' - ఇదా మనం నేర్చుకోవలసింది? కాదు, కాదు. దైవత్వాన్ని హృదయంలో నింపుకోవాలి. ఈనాటి విద్యావిధానము అనేక వంకరలు తిరిగిపోతున్నది. ఆనాడు అష్టావక్రునికి దేహములో మాత్రమే వక్రములుండినాయి. ఈనాడు మనిషికి మనస్సులోనే వక్రములున్నాయి. మొట్టమొదట ఈ వంకరటింకర మనస్సును చక్కదిద్దుకోవాలి. అప్పుడే మీరు నిజమైన విద్యావంతులవుతారు.

**ప్రహ్లాదుని ఆదర్శం**

ఈనాడు ప్రపంచంలో ఉన్న పండితులందరూ ఏకమైనా ఆనాటి అష్టావక్రునికి సాటిరారు. చదువులు హద్దులేకుండా పెరిగిపోతున్నాయి. కాని, చదువులో ఉన్న సారమేమిటో ఎవ్వరూ గుర్తించుకోలేకపోతున్నారు. మొట్టమొదట మానవుడు తన తత్త్వాన్ని తాను గుర్తించుకోవాలి. లేకపోతే, ఎంత చదువు చదివి ఏమి ప్రయోజనం? ఒకపర్యాయం హిరణ్యకశిపుడు తన కుమారుడైన ప్రహ్లాదుణ్ణి పిలిపించి, 'నాయనా! నీ చదువు ఎంతవరకు వచ్చింది? నీ గురువులైన చండ, అమర్కులు నీకెటువంటి విద్యలు నేర్పించారు?' అని అడిగాడు. అప్పుడు ప్రహ్లాదుడు చెప్పాడు -

**చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు; నే**
**జదివినవి గలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్ల జదివితి దండ్రీ!**

హిరణ్యకశిపుడెంతో ఆనందించి, 'నాయనా, ఏమిటా మర్మము? ఒక్కమాట చెప్పు,' అన్నాడు. 'ఓం నమో నారాయణాయ' అన్నాడు ప్రహ్లాదుడు. హిరణ్య కశిపునికి పట్టలేనంత కోపం వచ్చింది. నారాయణనామాన్ని స్మరించకూడదని ప్రహ్లాదుణ్ణి శాసించాడు. తన మాట

వినకపోయేసరికి అతనిని అనేక హింసలకు గురి చేశాడు. కాని, ప్రహ్లాదుడు చలించలేదు. నిరంతరం దైవనామాన్ని స్మరిస్తూనే ఉన్నాడు. దైవభక్తి, ప్రేమ, సహనము ఇత్యాది సద్గుణములను పెంపొందించేదే నిజమైన చదువు.

**గ్రంథపరిచయం కాదు, హృదయపరిచయం**

విద్యార్థులారా! మీరు చదివిన చదువులు హృదయానికి హత్తుకొనిపోవాలి. మన పూర్వీకులు ఏ చదువులూ చదువుకోలేదు. అయినప్పటికీ వారు చెప్పే మాటల్లో ఎంతో పవిత్రత ఉండేది. ఓనమాలు నేర్పని తల్లులు కూడా ఎంతో గొప్ప బోధలు చేసేవారు. మొట్టమొదట మీరు నేర్చుకోవలసింది దైవప్రార్థన. దైవమును మెప్పించాలి. దైవచింతనతో మీ జీవితాన్ని గడపాలి. ఈరకమైన విద్యను తల్లిదండ్రులు తమ పిల్లలకు నేర్పించాలి.

**కొక్కొరొకోయని కోడి కూయగనే**
**చక్కగా నిద్రమంచమునుండి లెమ్ము**
**పల్తోముకొని దేహబాధ దీర్చుకొని**
**జలకమాడి దుస్తులు ధరించి చల్ది భుజించు**
**హితమైన వస్తువు ఎంతయు నమిలి**
**మితముగ భుజించిన మేలగు నీకు**
**బడికేగి శ్రద్ధగా పాఠముల్ నేర్చి**
**అణకువ గల బాలుడనిపించుకొనుము**
**తేమలో నెప్పుడు తిరుగంగబోకు**
**మురికిగుంటల చెంత పోబోకుమెపుడు**
**పరుగుడు చెడుగుడు బంతులాటయును**
**సరియైన వేళల సలుపుచునుండు**
**పైరీతుల నీవు పరిగణింతువేని**
**ఆరోగ్యభాగ్యంబు లనుభవించెదవు**

ఇలాంటి చదువు తల్లిదండ్రులు నేర్పితేనే వస్తుందిగాని, గ్రంథాలు చదివితే రాదు.

sri sathyasai vachanamrutam

## తేదీ 02.06.2003, సాయిరమేశ్ సభామండపం, బృందావనం

గ్రంథపరిచయం ముఖ్యం కాదు, హృదయ పరిచయం కావాలి. పిల్లలు బడికి పోతున్నారు. కాని, ఏమి నేర్చుకుంటున్నారు? అసలు బడి అంటే ఏమిటి? మీకు తెలిసే ఉండవచ్చు – దొంగమార్గములో పోయే ఎడ్లకు బడి కడతారు. (అంటే, అవి అటూ ఇటూ పరుగెత్తడానికి వీల్లేకుండా వాటి మెడకు ఒక దుడ్డుకఱ్ఱను వ్రేలాడదీయడం) అది ఒకవిధమైన నిబంధన. నిబంధన లేని బడికి వెళ్ళడ మెందుకు? పిల్లలు బడికి పోతున్నారు, వస్తున్నారు. కాని, ఏమీ నేర్చుకోవడం లేదు. మొట్టమొదట మీరు నేర్చుకోవలసింది దైవచింతన. 'హరి' అనే పదానికి అర్థం తెలుసుకోవాలి. హరినామాన్ని స్మరించాలి. అది నేర్చుకోకుండా మీరు ఎన్ని విద్యలు నేర్చినా ప్రయోజనం లేదు. మీరు ఏవో క్రొత్త చదువులు నేర్చుకోనక్కర్లేదు, పాతచదువులే నేర్చుకోవాలి. పాత చదువులలోనే మీకు తెలియని విషయాలు ఎన్నో ఉన్నాయి. ఏ చదువూ రాని తల్లులు ఎన్నో మంచి విషయాలను బోధించగలరు. ఈనాటి విద్యార్థులు పెద్దపెద్ద పుస్తకాలను చదువుతున్నారు. ఒక్కొక్క పుస్తకం ఒక దిండుమాదిరి తలక్రింద పెట్టుకొని పడుకోవడానికి బాగా పనికివస్తుంది! ఇవన్నీ పొట్టకూటి విద్యలు. నిజమైన విద్యకోసం మీరు పాటు పడాలి. చదువుతోపాటు మీ ప్రవర్తననుకూడా సక్రమంగా తీర్చిదిద్దుకోవాలి.

> **ఎన్ని విద్యలు నేర్చిన నేమి ఫలము?**
> **నొసటి వ్రాతను తప్పింప నెవరి తరము?**
> **చెడ్డబుద్ధులు తన తల చేరెనేని**
> **ఎండబారును బుద్ధులు బండబారు**

మీ బుద్ధులను చక్కదిద్దుకోకుండా ఎన్ని చదువులు చదివి ఏమి ప్రయోజనం? బుద్ధులు సరియైనవిగా ఉన్నప్పుడే ప్రవర్తన సరియైనదిగా ఉంటుంది. మీరు మీ స్వంత మనస్సుపై ఆధారపడండి, ఎవరి మనస్సునో బాడుగకు తీసుకోకండి. ఈనాటి నుండైనా చక్కని బుద్ధులను, చక్కని నడవడికను అభివృద్ధిపరచుకోండి. శీలసంపద లేకపోతే ఎన్ని సంపదలున్నా ప్రయోజనం లేదు. శీలనిర్మాణమే విద్య పరమావధి. అశ్వత్థామ గొప్ప విద్యావంతుడే కాని, గుణము లేనివాడు. కనుకనే, నిద్రిస్తున్న ఉపపాండవులను హతమార్చినాడు. అర్జునుడు అతనిని పట్టి బంధించి తెచ్చాడు. క్షమా హృదయురాలైన ద్రౌపది అతని ప్రాణం తీయవద్దని కోరడంచేత అర్జునుడు అతని శిరోజములను ఖండించి,

చూడాంతర్మహారత్నమును పుచ్చుకొని అతనిని వదలిపెట్టాడు.

**హనుమంతుని అనన్యభక్తి**

గుణరత్నమే గొప్ప రత్నము. అది మీవద్ద ఉన్నప్పుడు మీరు ఎంతటి ఘన కార్యమునైనా సాధించవచ్చును. సీతాదేవి హనుమంతునికిచ్చిన చూడామణిని ఇటీవల కొడైకెనాల్‌లో పిల్లలకు చూపించాను. ఆ శిరోరత్నమును హనుమంతుడు తన ప్రాణసమానంగా భావించి ఒక చేతిలో పట్టుకున్నాడు. అందుచేతనే, అంతటి గొప్ప కార్యమును చేయగలిగాడు. పట్టాభిషేకము జరిగే సమయంలో రాముడు వానరవీరులకు ఎన్నెన్నో బహుమతులను అందజేశాడు. అప్పుడు సీత, 'రామచంద్రా! మీరు హనుమంతుణ్ణి ఏవిధంగా సత్కరించబోతున్నారు?'

**రఘుపతి కార్యంబిడేర్చిన కపిరాజ శిఖామణి ఇతడయ్యా**
**అఘములు పురికొన జగములో వెలసిన హనుమత్ గురుడు ఇతడయ్యా**
**పరిపరి లంకాపురమున జొచ్చిన పురవరశౌర్యుండితడయ్యా**
**పరిపరి విధముల జానకి వెదకిన మహిత పరాక్రముడితడయ్యా**

'ఇంత గొప్పవానికి ఈ మహాసభలో మీరిచ్చే బహుమతి ఏమిటి?' అని అడిగింది. అప్పుడు రాముడు చెప్పాడు, 'సీతా! బహుమతులను మెచ్చే మనస్సు కాదు హనుమంతునిది. అతనికి నచ్చినది ఒకటుంది. దానిని నేనతనికి తప్పక అందిస్తాను.' అప్పుడు సీత తన మెడలోని ముత్యాలహారము *(వివాహసమయంలో తన తండ్రి జనకమహారాజు ఇచ్చినది)* తీసి హనుమంతునికి బహూకరించింది. దానిని కొరికి కొరికి పారవేశాడు హనుమంతుడు. "రామనామం లేని ముత్యాలు నాకు అక్కర్లేదు," అన్నాడు. అప్పుడు రాముడు లేచి అతనిని కౌగిలించుకొని, 'హనుమా! ఇదే నేను నీకిచ్చే శాశ్వతమైన బహుమతి. నేను నిన్ను, నీవు నన్ను ఒకరినొకరం ఏనాటికీ వదలిపెట్టడం జరగదు. మనమధ్య ఏనాటికీ ఎడబాటు ఉండదు. ఇదే నీకు నిత్యమైన, సత్యమైన బహుమానం,' అని చెప్పాడు. హనుమంతుడు ఆనందబాష్పాలు రాల్చుతూ, 'ఇంత కంటే నాకేమి కావాలి రామచంద్రా! నీవు తప్ప నాకు అన్యము అక్కర్లేదు. నీ నామమే నాకు ప్రధానమైన ధనము. నీ రూపమే నాకు ప్రాణము. ఈ రెండే నాకు చాలు,' అన్నాడు.

srisathyasaivachanamrutam

ఒక పర్యాయం కౌసల్య శ్రీరామునిపుట్టినరోజు సందర్భంగా గొప్ప విందు ఏర్పాటు చేసి అందరినీ ఆహ్వానించింది. అందరికీ బహుమతులను పంచిపెట్టింది. అందరూ నిష్క్రమించిన తరువాత రాముడు తన గదిలోకి వెళుతున్నాడు. రామునివెంట సీత బయల్దేరింది. హనుమంతుడుకూడా రామునివెంట వెళుతుంటే కౌసల్య, 'నాయనా! రాముడు విశ్రాంతి తీసుకోవాలి. నీవు వెళ్ళనక్కర్లేదు,' అన్నది. 'మరి సీతమ్మవారు వెళుతున్నారు కదా! నేనెందుకు వెళ్ళకూడదు?' అని ప్రశ్నించాడు హనుమంతుడు. సీతయొక్క సిందూరతిలకమును చూపిస్తూ కౌసల్య, 'రామునివెంట వెళ్ళడానికి ఆమెకు అదే అర్హత,' అని చెప్పింది. హనుమంతునికి కోపం వచ్చేసింది. వెంటనే బజారుకి వెళ్ళి అక్కడ దొరికిన సిందూరమునంతాఒంటికి పూసుకున్నాడు. 'కాస్త సిందూరం పెట్టుకున్నందువల్ల సీతమ్మకు రాముని వెంట ఉండే హక్కు కలిగితే ఒళ్ళంతా సిందూరం పూసుకున్న నాకెందుకు ఆ అధికారం ఉండదు?' అని భావించాడు. ఇంతటి భక్తిప్రపత్తులు ఈనాడు ఎవరికున్నాయి? ముందుకాలం మంచిగా ఉండవచ్చునని మీరు ఆశిస్తున్నారు. కాని, గడచిన కాలమే చాలా మంచిది. అలాంటి కాలమే మనకు చిక్కదిండక. కాబట్టి, చిక్కిన అవకాశాన్ని వక్క సేయక చక్కచేసుకోండి.

ఒకానొక సమయంలో హనుమంతుని తల్లి కౌసల్య ఇంటికి వచ్చింది. కౌసల్య, 'అమ్మా! ఎవరు మీరు?' అని అడిగింది. 'అమ్మా! నేనెవరో మీకు తెలియదా? విశాలమైన సముద్రాన్ని అవలీలగా దాటిన హనుమంతుని తల్లిని,' అని ఆమె జవాబిచ్చింది. మరికొద్దిసేపటికి అగస్త్యుని తల్లి వచ్చింది. 'అమ్మా! మీరెవరు?' అని అడుగగా, 'మహా సముద్రాన్ని ఒక్క గుటకలో మ్రింగిన అగస్త్యుని తల్లిని నేను,' అని సమాధానమిచ్చింది. కౌసల్య చాలా ఆనందించి, 'నా కుమారుడైన రాముని అనుగ్రహమువల్లనే కదా మీ కుమారులు అంతటి ఘనకార్యములు సాధించ గల్గారు,' అన్నది. అప్పుడు రాముడు వచ్చి, 'అమ్మా! ఇందులో నీ ఘనత, నా ఘనత ఏమీ లేదు. వాళ్ళు పవిత్ర హృదయంతో రామనామమును స్మరించడం చేతనే అంతటి ఘన కార్యములను సాధించగలిగారు. రామనామమే సర్వమునకు మూలాధారము,' అన్నాడు.

sri sathyasai vachanamrutam

**ఈశ్వరమ్మ, పెద్ద వెంకమరాజుల ఆదర్శం**

ఒకానొక సమయంలో స్వామి పుట్టిన పండుగ సందర్భంగా ఊరివారందరూ ఈశ్వరమ్మదగ్గరకు వెళ్ళి, 'అమ్మా! ఈరోజు మీ కుమారుని పుట్టిన పండుగ. ఈ ఉత్సవంలో మీరు కూడా పాల్గొనాలి,' అని కోరారు. 'అంతకంటే నాకు కావలసిన భాగ్యమేమిటి?' అని ఆమె ఊర్లోనుండి నడుచుకుంటూ వచ్చింది. నేనుండే రూముదగ్గరికి వస్తూనే కూర్చుంది. 'స్వామీ! నీ రూమువరకు నడవగలిగాను. ఇంక ముందుకు నడవలేను,' అన్నది. అప్పుడు వెంకమ్మ, 'అమ్మా! నేను పట్టుకుంటాను, మీరు నడవండి,' అన్నది. 'మీరెవ్వరూ నన్ను పట్టుకోనక్కర్లేదు. స్వామియే నన్ను పట్టుకుంటాడు. స్వామియే నన్ను అన్నివిధాలుగా రక్షిస్తాడు,' అని చెప్పింది ఈశ్వరమ్మ. స్వామిపట్ల ఆమెకు గల విశ్వాసం అంత గొప్పది.

1972 మే నెలలో బృందావనంలో సమ్మర్ క్లాసులు జరుగుతున్నాయి. ఒకరోజు ఉదయం ఈశ్వరమ్మ టిఫిన్ తిని, కాఫీ త్రాగి కూర్చుంది. తాంబూలం దంచుకుని నోట్లో పెట్టుకుంది. ఉన్నట్లుండి, 'స్వామీ! స్వామీ! స్వామీ!' అని మూడు తూర్లు పిలిచింది. నేను, 'వస్తున్నాను,వస్తున్నాను' అన్నాను. వచ్చాను. ఆమె పిలిచింది, నేను వచ్చాను. నేను వచ్చేటప్పటికే తాను పోయింది.

ఈ దేహానికి తండ్రియైన పెద్ద వెంకమరాజు కూడా అంతే! తాను పోయేరోజున నాదగ్గరకు వచ్చి కొంత డబ్బిచ్చి, 'స్వామీ! నేను పోయిన తరువాత పన్నెండవ రోజున బీదలకు అన్నదానము చేయండి,' అని కోరాడు. వారిద్దరూ అంతే! తమకు లేకపోయినా పదిమందికి దానధర్మాలు చేసేవారు. అలాంటి తల్లిదండ్రులకు పుట్టేవారు చాలా అదృష్టవంతులు. ఎవరైనా ఈశ్వరమ్మవద్దకు వచ్చి, 'అమ్మా, నాకు గాజులు లేవు,' అంటే, 'గాజులు లేవా? నీవు ముత్తయిదువవు కదా! చేతికి గాజులుండాలి,' అని చెప్పి ఇంట్లోకి పోయి చేటలో ఇంత బియ్యము తెచ్చిపెట్టి గాజులు తొడిగించేది. అప్పుడు ఆమె దగ్గర నయాపైసా ఉండేది కాదు. ధాన్యము నిచ్చి బీదలకు సహాయపడేది.

**ఆ కుటుంబములో అందరిదీ త్యాగబుద్ధే!**

ఈ దేహముయొక్క తాతగారైన కొండమరాజు కూడా చాలా గొప్ప గుణము గలవాడు. అందరినీ సమత్వంతో చూసుకునేవాడు. ఆయనకు పెద్ద వెంకమరాజు, చిన్న వెంకమరాజు

అని ఇరువురు కుమారులు. సుబ్బరాజు, వెంకట్రామరాజు ఆయన తమ్ముని కుమారులు. నల్గురికీ తన ఆస్తిపాస్తులను పంచిపెట్టాడు. 'ఏ ఆస్తీ నాకక్కర్లేదు. 'సత్యం'ను నాకిచ్చేయండి, చాలు. 'సత్యం' ఒక్కడు నాదగ్గరుంటే సర్వము తానే చూసుకుంటాడు,' అన్నాడు. అప్పుడు నన్ను ఆయనకు ప్రోపర్టీగా ఇచ్చారు. ఇప్పుడే ఈ దేహము ఇంత ఎత్తున్నది. అప్పుడింకా చాలా పొట్టిగా ఉండేవాడిని. ప్రతి రోజూ ఉదయం బుక్కపట్టణం స్కూలుకి పరుగెత్తి పోయేవాడిని, మధ్యాహ్నం వచ్చి భోజనం చేసి మళ్ళీ వెళ్ళేవాడిని. ఈవిధంగా కాలము గడచిపోతూ వచ్చింది. ఆయన నన్ను 'సత్యా' అని పిలిచేవాడు. ఎప్పుడూ 'సత్యనారాయణా' అని పిలువలేదు. మిగిలినవారంతా 'రాజూ' అని పిలిచేవారు. ఎవ్వరూ నన్ను పేరుపెట్టి పిలిచేవారు కాదు. ఒక్కొక్కసారి నేను సాయంకాలం ఇంటికి వచ్చేటప్పటికి కొండమరాజు, 'నాయనా, సత్యా! ఆ ఇంట్లో ఎవరికో జ్వరంగా ఉందట. నీ చేత్తో ఇంత రసం పెట్టి ఇస్తే వారికి బాగైపోతుంది,' అనేవాడు. వాళ్ళ కోరికమేరకు నేను రసం పెట్టి ఇచ్చేవాడిని. నేను చేసిన మిరియాలరసం జ్వరానికి గొప్ప మందుగా పనిచేసేది.

ఒకనాటి రాత్రి నేను పండుకున్నట్లు నటించాను. ఆయనకూడా పండుకున్నట్లుగా నటించాడు. కొంతసేపటికి నా శ్వాసనుండి 'ఓం.... ఓం...' అని వినిపిస్తోంది. ఆయనకు ఆశ్చర్యం కలిగింది. నా శ్వాసదగ్గర చెవిపెట్టి విన్నాడు. తెల్లవారి లేచిన తరువాత, 'సత్యా! ఈపొద్దు పండుగ చేసుకోవాలి నాయనా,' అన్నాడు. 'ఎందుకు తాతా?' అని అడిగితే, 'నీ శ్వాసనుంచి ఓంకారము వినిపించింది,' అన్నాడు. 'అదేమైనా ఈనాడు కొత్తనా? ఎప్పుడూ ఉన్నదే,' అని చెప్పాను. ఈవిధంగా, కొండమరాజు అనేక అనుభూతులను పొందాడు. ఆ కుటుంబమంతా గొప్ప పేరుప్రతిష్ఠలు తెచ్చుకున్నది. వారెన్నడూ అన్యాయ, అక్రమ, అనాచారములకు పాల్పడలేదు.

కొండమరాజు పోయేముందుగా ఒకరోజు నా చేతిలో కొంత డబ్బు పెట్టి, 'స్వామీ! నేను అంగడిలో ఏదో చిన్న వ్యాపారం చేస్తూ వచ్చాను. ఎవరికైనా కానో, బొట్టో ఇవ్వడం మరచిపోయి ఉండవచ్చు. నేనింకొకరి ఋణములో పోకూడదు. కాబట్టి, ఈ డబ్బును చిల్లరగా మార్చి నా శవాన్ని తీసుకుపోయే సమయంలో దానిపై చల్లించండి. ఏదైనా

srisathyasaivachanamrutam

ఋణము మిగిలి ఉంటే తీరిపోతుంది,' అని అన్నాడు. 'నీవు డబ్బు ఇవ్వడమెందుకు? నాదగ్గర ఉంది. నేనిస్తాను,' అన్నాను. 'లేదు స్వామీ, నా డబ్బుతోనే ఋణం తీరిపోవాలి,' అన్నాడు. ఆ కుటుంబములో అందరిదీ త్యాగబుద్ధే! ఇప్పుడు జానకి రామయ్య ఉన్నాడు. ఆయనకూడా అందరికీ పెడుతుంటాడు. అటువంటి త్యాగబుద్ధిగల కుటుంబము కాబట్టే, వారంతా దైవానుగ్రహానికి పాత్రులైనారు. అదొక్కటే మనకు కావలసింది. అది ఉంటే చాలు.

కొండమరాజు, 'స్వామీ! నీవు సాక్షాత్తు దేవుడవు. ఈవిషయం నీకు, నాకు తప్ప ఎవ్వరికీ తెలియదు,' అనేవాడు. తెల్లవారుజామున చేతికఱ్ఱ పట్టుకొని ఊరినుండి క్రొత్తమందిరానికి వచ్చేవాడు. ఆయన రావడం చూసి నేను కన్నులు మూసుకొని నిద్రపోతున్నట్లు నటించేవాడిని. ఎవ్వరికీ తెలియకుండా నెమ్మదిగా రగ్గు తొలగించి నా పాదాలకు నమస్కరించేవాడు.

ఆయనకు ఒబ్బట్లంటే చాలా ఇష్టం. తాను పోయే ముందురోజున ఈశ్వరమ్మను ఒబ్బట్లు చేసిపెట్టమని కోరాడు. ఆమె చేసి నాకు కూడా కొంచెం పెట్టింది. 'నేను స్వీటు తినను,' అన్నాను. కొండమరాజు చాలా బలవంతం చేశాడు. 'స్వామీ! నాకు అంత్యకాలము సమీపించింది. ఈ దేహానికి 112 సం॥లు. నేను పోయేముందు నా చేత్తో ఒక్కతూరి మీ నోట్లో పెట్టాలి. యశోద పెట్టింది, కౌసల్య పెట్టింది, అని అంటారు. నాకట్టి అదృష్టం చిక్కింది. కాబట్టి, నా చేత్తో మీ నోట్లో పెట్టాలి,' అన్నాడు. పెట్టాడు. కాని, అది నా నోట్లో లేదు, ఆయన చేతిలో లేదు! 'ఎక్కడ పారేశావు మామా?' అని అడిగింది ఈశ్వరమ్మ. 'స్వామి లీలలు ఒకటా, రెండా... ఎన్నో జరుగుతుంటాయి. వర్ణించడానికి వీలుకాదు,' అన్నాడు కొండమరాజు. మరునాడు ఆయన ప్రశాంతంగా కన్నుమూశాడు. ఈ దేహానికి సంబంధించినవారంతా ఇలాగే అనాయాసమరణం పొందారు. వారు కష్టపడినప్పటికీ సుఖసంతోషాలతో జీవితం గడిపారు. వారికి లేకపోయినా పదిమందికి పెడుతూ వచ్చారు. ఈ కుటుంబం అందరికీ సంబంధించింది కనుక తగినరీతిగా అందరికీ చెప్పాలని చెప్పాను. ప్రతి మానవుడు అలాంటి కుటుంబంలో మెంబరు కావాలి.

విద్యార్థులారా! మీ శక్త్యనుసారం బీదలకు సహాయం చేయండి. వారికి చదువు

sri sathyasai vachanamrutam

ఉచితంగా చెప్పించండి. నీరు ఉచితంగా ఇవ్వండి. అన్నం ఉచితంగా పెట్టండి. మీకు ఏది కావలసినా ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను.

**అన్నదానముకన్న అధికదానంబేది?**
**తల్లిదండ్రుల కన్న దైవమేది?**
**జపతపంబులకన్న సత్యశీలంబేది?**
**దయకంటె నెక్కువ ధర్మమేది?**
**సుజన సంగతి కన్న చూడ లాభంబేది?**
**క్రోధంబుకన్న శతృత్వమేది?**
**ఋణముకంటెను నరునకు రోగమేది?**
**ధరణినపకీర్తికంటెను మరణమేది?**
**సర్వదా కీర్తికంటెను సంపదేది?**
**స్మరణకంటెను మించు నాభరణమేది?**

స్మరణయే మనకు నిజమైన ఆభరణము. మీరు తల్లిదండ్రులను తృప్తిపెట్టాలి. ప్రతి దినం వారి పాదాలకు నమస్కారం చేయాలి. కట్టకడపటికి మీ చేతులమీదుగా వారికింత నీరు విడచాలి. కుమారులై పుట్టినందుకు ఆ సత్కీర్తిని పొందాలి. అప్పుడే మీ జీవితము సార్థకమౌతుంది. తల్లిదండ్రులు భౌతికంగా లేకపోయినా వారు ఉన్నట్లుగానే మీరు భావించండి. తెల్లవారి లేస్తూనే వారికి నమస్కరించండి. వారికి మీరివ్వవలసిన తర్పణము ఏమిటి? బొబ్బట్లు, గారెలు చేసి బ్రాహ్మణుని పిల్చి వడ్డించడం... ఇది కాదు. తల్లిదండ్రులను కృతజ్ఞతతో ఒకతూరి తల్చుకొని ఆనందబాష్పాలు వదిలితే చాలు, అదే నిజమైన తర్పణము. తల్లిదండ్రుల ఋణాన్ని తీర్చుకోండి. అదే గొప్ప పుణ్యము. అదే గొప్ప భాగ్యము. అట్టి భాగ్యాన్ని మీరు అనుభవిస్తారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా దీర్ఘప్రసంగాన్ని విరమిస్తున్నాను.

(తేదీ 02.06.2003, సాయిరమేశ్ సభామండపం, బృందావనం)

srisathyasaivachanamrutam